

రేషన్ సరుకుల కోసం ఇబ్బందులు 6లో..

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి 8లో..



వర్షాకాలం వ్యాధుల భయం

- పొంచి ఉన్న వానాకాలం ముప్పు
- వైద్య శాఖ ప్రత్యేక కార్యాచరణ
- మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పాటు

జగిత్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు మురుగు నీటి నిల్వలు, కలుషిత నీటి సరఫరా, పారిశుధ్య సమస్యలు తలెత్తడం, అంటు వ్యాధులు, డయేరియా, ఇతర వ్యాధుల ముప్పు పరిపాటిగా మారుతోంది. వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు వంటివి పెరిగితే, అపరిశుభ్రత కారణంగా క్రిమి, కీటకాలు, దోమలు, వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు సోకుతాయి. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ శాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

వర్షాకాలంలో విషజ్వరాలకు అడ్డుకట్ట వేయడానికి వైద్యశాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. జిల్లా కేంద్రంలో ప్రధాన ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాలకు అనుబంధంగా మాతా శిశు కేంద్రం పని చేస్తున్నాయి. వీటితో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 151 సబ్ సెంటర్లు, 24 గంటలు పనిచేసే ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం, 71 పల్లె దవాఖానలు, 3 బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. వీటితో పాటు సుమారు 200 వరకు పలు ప్రైవేటు ఆసుపత్రులు న్నాయి.

యేటా పెరుగుతున్న డెంగీ కేసులు

వర్షాకాలంలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. జిల్లాలో 2018 సంవత్సరంలో 31 డెంగీ కేసులు, 2019 సంవత్సరంలో 128, 2020 సంవత్సరంలో 5 కేసులు, 2021 సంవత్సరంలో 98, 2022 సంవత్సరంలో 297, 2023 సంవత్సరంలో 143 డెంగీ కేసులు నమోద య్యాయి. ముందస్తు జాగ్రత్తగా వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా కేసులను వైద్యులు గుర్తిస్తున్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తం

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండగా ప్రోగ్రాం అధికారులతో పాటు నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లను నియమించి సీజనల్ వ్యాధులను పర్యవేక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. వ్యాధులు త్వరగా ప్రబలే హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించారు. క్షేత్ర స్థాయిలో రాపిడ్ బృందాలను ఏర్పాటు చేసి ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి వ్యాధులపై సర్వే నిర్వహించనున్నారు. టీ హబ్ కేంద్రంలో మలేరియా పరీక్ష కిట్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. అన్ని ప్రాథమిక కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచేలా జాగ్రత్తలు వహిస్తున్నారు. ప్రతి శుక్రవారం కాకుండా హైరిస్క్ కేంద్రాల్లో ప్రతి రోజు డ్రై డే నిర్వహిం చడానికి నిర్ణయించారు. వైద్య శాఖ సిబ్బం దికి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

ముందు జాగ్రత్తలతో మేలు

దోమకాటుతో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోధకాలు, మెదడు వాపు తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. డెంగీ వ్యాధి కారక దోమ సాధారణంగా నిల్వ ఉన్న నీటిలో వృద్ధి చెందుతుంది. పాత టైర్లలో, వాడి పడేసిన కొబ్బరి చిప్పలు, పాత కుండలు, పాత ఇనుప సామగ్రిలో డెంగీ లార్వాలు వృద్ధి చెందుతాయి. వీటిని తొలగించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది, పురపాలక సిబ్బంది వార్డుల్లో పర్యటించి ప్రజలకు తెలియజేస్తున్నారు. మురికి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేయడానికి సమాయత్తం అవుతున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లోని నిలిచిన నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం, లేదంటే దోమలను తినే గంబూసియా అప్పినిస్ చేప లను వాటిలో వేస్తుండాలి. మురుగు కాలువలు శుభ్రంగా ఉంచ డం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ లాంటివి చేయడంపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడడం, వారానికో సారి డ్రమ్ముల్లోని నీటిని పారబోయటం, నీటి ట్యాంకులు, డ్రమ్ములు, మంచి నీటి ట్యాంకులపై మూతలు పెట్టడం, కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలి.





సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాం

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, జగిత్యాల

ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వైద్య ఆరోగ్యశాఖ పరంగా ముందస్తుగా దృష్టి సారించాం. ఇప్పటికే ఇందుకు అవసరమైన సమాచారాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులకు అందించింది. జిల్లాలోని అన్ని మండలాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు సైతం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది.



పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలి

దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి, జగిత్యాల

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పరిశుభ్రతను మరింత పెంపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పారిశుధ్య సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు వహిస్తున్నాం. మురుగు నీరు నిల్వ ఉండడం, రోడ్లపై చెత్తాచెదారం ఉండకుండా చూస్తున్నాం. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ఇంటర్ స్పాట్ రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి



ఇంటర్ విద్యాధికారి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

జగిత్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల్లో విధులు నిర్వహించే సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించే విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాలలో జూనియర్ లెక్చరర్లు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ -475 ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు లెక్చరర్లు మాట్లాడారు. రెండు సంవత్సరాల క్రితం వరకు పరీక్షల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి పారితోషికాన్ని వెంటనే చెల్లించే వారని, అనంతరం సిబ్బంది బ్యాంక్ అకౌంట్‌కి ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేసే పద్ధతిని తీసుకొచ్చారని వివరించారు. రెమ్యునరేషన్‌ను ఎప్పటికప్పుడు కాకుండా ఆలస్యంగా అకౌంట్‌లో జమచేయడం జరుగుతుందన్నారు. దీనివలన రెమ్యునరేషన్ చేతికి అందడం నెలల తరబడి ఆలస్యమవుతుందన్నారు. లెక్చరర్ల రెమ్యునరేషన్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, పాత పద్ధతిలోనే రెమ్యునరేషన్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఇంటర్ విద్యాధికారి, ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం క్యాంపు అధికారి నారాయణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీజీజెఎల్ఏ-475 జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్, కోశాధికారి చలిమల జయ పాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రచన, నాయకులు కంకణాల శ్రీనివాస్, కాశవేణి శ్రీనివాస్, శ్రీహరి, వంశీకృష్ణ, చంద్రశేఖర్, శ్రీకాంత్, భాస్కర్, బాల కృష్ణ, శ్రీలత, మాధవి, సునీత, శిల్ప, క్రాంతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్



నీటి కుండిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కొడిమ్యాల, జూన్ 7: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిపించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పూడూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఆయన సందర్శించారు. అనంతరం గ్రామంలోని కుర్మవాడలో క్లీన్ అండ్ గ్రీన్, డ్రైడే గురించి ప్రజలకు వివరించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమ కాటు వలన కలుగే వ్యాధులను గురించి వివరించారు. ఆయన వెంట వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వైద్య సిబ్బంది లచ్చయ్య, విష్ణు, వేణు, హెల్త్ సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్ ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్



డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

జగిత్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని కోరుతూ జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డికి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అంగడి కుమార్ వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించారు. జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోందని వాపోయారు. ఎల్‌కేజీ నుంచి రూ. లక్షల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారని ఆరోపించారు. టెక్నో, ఈ-టెక్నో, ఐటీలతో తోక పేర్లను తగిలించి బోర్డులను ఏర్పాటు చేసి యథేచ్ఛగా ప్రవేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించడం కొరకు టెస్టులు పెడుతూ ప్రవేశాలను బహిరంగంగా నమోదు చేస్తున్నారని ఆరోపించారు. విద్యా సంస్థల్లోనే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇతర స్టేషనరీ విక్రయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజుల వివరాలను బోర్డులో ఏర్పాటు చేసి బహిరంగ పరచాలన్నారు. స్కూలు ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, హాస్టల్ ఫీజులు, దోబి ఫీజులతో పాటు రకరకాల ఫీజులను దండుకుంటున్నారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల పనితీరుపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు సతీష్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా



జగిత్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సీజన్‌లో క్రాప్ బుకింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృ కలెక్టరేట్ కార్యాయలంలో క్రాప్ బుకింగ్‌పై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతీ ఏఈఓ గ్రామాల్లో పర్యటించి సర్వే నంబర్ల వారీగా పంటలను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు జీలుగ 9,957 హెక్టార్లు, జనుము 892.3 హెక్టార్లలో సాగు చేయడం జరిగిందని వివరించారు. అదే విధంగా గొల్లపల్లి, కొడిమ్యాల, కోరుట్ల, మెట్‌పల్లి తదితర ప్రాంతాల్లో సుమారు 98 హెక్టార్లలో వరి నారుమళ్లు పోయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో రైతుల డిమాండ్‌కు సరిపడా జీలుగ, జనుము, పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఇన్సూరెన్స్ కవరేజీ అర్హులైన రైతు కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా సకాలంలో అందించాలని తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్తీ విత్తనాలను అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి వాణి, వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వాసవి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, జూన్ 7 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని రాంబజార్‌లో ఉన్న శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయంలో వాసవి మాత సత్సంగ భజన మండలి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 2024 సంవత్సరంలో రూపొందించిన భజన భక్తి గీతాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యఓఉడు మంచాల కృష్ణ, గీతా సత్సంగం ఉపాధ్యక్షుడు కోటగిరి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సత్సంగం సభ్యులు

పొలాస ఆలయంలో ఘనంగా కుంకుమార్చన

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసలోని శ్రీలలితమాత ఆలయంలో శుక్రవారం సహాసినిలు, కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ఆధ్వర్యంలో లలితమాత ఆలయంలోని 108 శ్రీచక్రాలకు మహిళలు, భక్తి శ్రద్ధలతో కుంకుమపూజలు నిర్వహించారు. లలితమాత సహస్రనామ పారాయణం, లలిలమాత చాలీసా గావించిన మహిళలు అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

బీర్‌పూర్,జూన్ 7:ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. మహిళ సంఘాలలోని స్వశక్తి సంఘాల మహిళలు కుట్టిన ఏకరూప పాఠశాల దుస్తులను సిద్ధం చేసి మండల విద్యాధికారి కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా కొంత మంది విద్యార్థినీ విద్యార్థులకు మహిళా సంఘాల సభ్యుల చేతుల మీదుగా దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లచ్చాలు, ఎంఈవో భీమయ్య, ఇంచార్జి ఏపీఎం రమేష్, సీసీలు, వివోఏలు, అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, జూన్ 7: మండలంలోని తక్కళ్లపల్లి కోరుట్ల మండలం నాగులపేట శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో 12 మంది పేకాట ఆడుతున్నట్టు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులకు పక్కా సమాచారం రావడంతో దాడులు చేశారు. వీరి నుంచి రు. 76 వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ఎండపల్లి విద్యార్థికి కాంస్య పథకం

ఎండపల్లి, జూన్7: మండలంలోని ఎండపల్లి గ్రామానికి చెందిన బైకాని గౌతమి ఈ నెల 6 నుంచి 7 వరకు హన్మకొండలో జరిగిన అండర్ 18 విభాగంలో 3 కేఎం రేస్ వాకింగ్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో మూడోస్థానం సాధించి కాంస్య పథకాన్ని పొందింది. ఈ సందర్భంగా గౌతమిని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, కోశాధికారి బైకాని కొమురయ్య, మారెపెల్లి కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి విద్యార్థినిని అభినందించారు.

సమస్యలపై చర్చించని మండల సమావేశం

- గంటలోనే ముగింపు

పెగడపల్లి, జూన్ 7: పెగడపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీపీ గోళి శోభాసురేందర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించగా సమస్యలపై సభ్యులు పెద్దగా స్పందించకపోవడంతో గంటలోనే సమావేశం ముగిసింది. సర్వసభ్య సమావేశంలో సర్పంచులు లేకపోవడం, ఎంపీటీసీ సభ్యులు ఇద్దరు మినహా సమస్యలపై స్పందించకపోవడంతో సమావేశం నామమాత్రంగా సాగింది. రాయితీపై అందిస్తున్న జీలుగ, జనుముతో పాటు పెసర, మినుము లాంటి విత్తనాలు సరఫరా చేయాలని ల్యాగలమర్రి ఎంపీటీసీ మందపెల్లి అంజయ్య కోరారు. పశుసంవర్ధక శాఖ ద్వారా గొల్ల కురుమలకు అందించిన గొర్రెల పంపిణీ పథకంలో డీడీలు కట్టిన రైతులకు ఏళ్ల తరబడి గొర్రెలు లేవు, డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని ఎల్లాపూర్ ఎంపీటీసీ ప్రశ్నించగా దరఖాస్తు చేసుకున్న రైతులకు డబ్బులు తిరిగి అందజేయనున్నట్లు పశువైద్యాధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇంకుడు గుంతల బిల్లులు చెల్లించడం లేదని , గ్రామాలలో తాగునీటి సరఫరాకు ఉపయోగించే ఓవర్ హెడ్ ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎల్లాపూర్ ఎంపీటీసీ కొత్తపల్లి రవి సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ శోభాసురేందర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, సింగిల్‌విండో చైర్మన్ కర్ర భాస్కర్ రెడ్డి, వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పెగడపల్లి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శోభ

బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

రాయికల్, జూన్ 7: క్షయ వ్యాధి నిర్మూలన కోసం బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాయికల్ మండల వైద్యాధికారి కస్తూరి సతీష్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని మార్కండేయ ఆలయ ఫంక్షన్ హాల్‌లో ఏఎస్ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు క్షయ వ్యాధిపై, క్షయ వ్యాధి నివారణ టీకా అయిన బీసీజీపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ వ్యాధి నుంచి రోగ నిరోధక శక్తి కలిగించడానికి, నిబంధనల మేరకు సూచించిన అర్హులైన వారికి బీసీజీ టీకా ఇవ్వాలని అన్నారు. ఇందుకోసం మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి బీసీజీ టీకా లబ్ధిదారులను గుర్తించి జాబితాను సిద్ధం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు గుర్తించిన పెద్దవారికి మాత్రమే బీసీజీ టీకా వేయడం జరుగుతుందని తెలిపారు. బీసీజీ టీకా వల్ల పెద్దలలో క్షయ వ్యాధి రాకుండా కాపాడవచ్చునని వివరించారు. ముఖ్యంగా క్షయ రావడానికి అధిక ప్రమాదం ఉన్న వ్యక్తులకు బీసీజీ టీకా చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకుల టి.శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీలు డాక్టర్ వినోద్ కుమార్, రాహుల్, ఝాన్సీ, మౌనిక, ఐసీడీసీ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్ భూమయ్య, డీఈవో పవన్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

మెట్‌పల్లి రూరల్, జూన్7: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి తహసీల్దార్ శేఖర్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆర్ఐ ఉమేశ్ పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందితో నిఘా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలింపు, నిల్వ చేసిన, మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అవసరం ఉన్న వారు అనుమతి పత్రాలను ట్రాక్టర్ డ్రైవర్ వద్ద ఉంచాలన్నారు. ఇంటి పత్రాలను కొంత మంది దళారులు తీసుకుని కార్యాలయం నుంచి అనుమతి తీసుకుని అత్యవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్నారు. రోడ్లపై ఇసుక, మట్టి ట్రాక్టర్లు అతి వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, అలాంటి వారిని పట్టుకుని అధికారులకు అప్పగిస్తామన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ సునీత

హుజూరాబాద్‌రూరల్, జూన్ 7: హుజూరాబాద్ ప్రాంతంలో నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకుంటామని ఏడీఏ సునీత అన్నారు. అనుమతులు ఒక్క చోట తీసుకొని విత్తనాలను మరో చోట విక్రయిస్తున్న కంపెనీ ప్రతినిధిపై 6ఏ కింద శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు, వ్యవసాయాధికారులు తెలిపారు. మేడ్చల్ జిల్లాకు చెందిన శాంభవి ఆగ్రి సీడ్స్ ప్రతినిధి రాచపల్లి లింగయ్య మండలంలోని శాలపల్లి -ఇందిరానగర్ గ్రామంలోని రైతులకు 20 కిలోల విత్తనాల బ్యాగుల చొప్పున 141 బస్తాలు సుమారు 60 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు వ్యవసాయ శాఖ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనుమతి ఒక చోట ఉంటే విత్తనాల విక్రయాలు మరోచోట జరిపినందుకు గాను సదరు కంపెనీ ప్రతినిధిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్, టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

10 నుంచి టీజీ పీఈసెట్

గణేశ్‌నగర్, జూన్ 7: తెలంగాణా ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024 (టీజీ పీఈసెట్)ను ఈ సంవత్సరం కూడా శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించ బడుతుందని కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ తెలిపారు. 2400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరికి జూన్10 నుంచి 13వరకు శాతవాహన విశ్వ విద్యాలయం లోని క్రీడా మైదానంలో శరీర దారుఢ్య సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహించమన్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6:30 నుంచి బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పురుష అభ్యర్థులకు ఈనెల 10,11వ తేదీల్లో, మహిళా అభ్యర్థులకు 12,13వ తేదీల్లో శారీరక సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే దూర ప్రాంత విద్యార్థులకు యూనివర్సిటీలో వసతి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ఎస్‌యూ బీఎస్సీ హానర్స్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూన్ 7: శాతవాహన విశ్వవిద్యాలయం బీఎస్సీ హానర్స్ రెండవ సెమిస్టర్‌కు సంబంధించిన తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 19 నుంచి 26 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

రేషన్ సరుకుల కోసం

ఇబ్బందులు

- కిలోమీటర్ల దూరం వెళ్తున్న ప్రజలు

- తుర్తిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వేడుకోలు



తుర్తి గ్రామం

కథలాపూర్, జూన్ 7: రేషన్ సరుకులు మా పల్లెలోనే పంపిణీ చేయండి మహాప్రభో అని మొరపెట్టుకుంటే... లేదండీ మీకు నిబంధనలు వర్తించవు అనే అధికారుల సమాధానాలతో ఆ పల్లె జనం ఎదుర్కొంటున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఏళ్ల తరబడి రేషన్ దుకాణాలు లేక కిలోమీటర్ల కొద్దీ దూరం నడిచి సరుకులు తెచ్చుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ ఇబ్బందులను పట్టించుకునే నాథుడే లేడని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● హామీలు నెరవేర్చని నేతలు

మూడు మండలాల సరిహద్దుల్లో ఉన్న తుర్తి గ్రామంలో నేటికీ రేషన్ దుకాణం ఏర్పాటు చేయని కారణంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబారిపేటకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఇక్కడికి కేటాయించిన సరుకులను అంబారిపేటకు చెందిన డీలర్‌తో పంపిణీ చేస్తున్నారు. అధునాతన పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా సరుకులు పంపిణీ చేస్తుండగా ఈ పల్లెలో టెలికాం నెట్‌వర్క్ సమస్య కారణంగా విధిలేని పరిస్థితుల్లో వినియోగదారులు అంబారి పేటకు వెళ్లాల్సి వస్తోంది. అదేవిధంగా అంబారిపేట పరిధిలో ఉన్న గిరిజనులు రెండు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి సరుకులు తీసుకెళ్తున్నారు. వానాకాలంలో వినియోగదారులకు విపరీతమైన ఇక్కట్లు తప్పడం లేదు. ఆరు సంవత్సరాల కిందట చింతకుంటకు అనుబంధంగా ఉన్న రాజారాం తండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఇక్కడ కూడా నేటికీ రేషన్ దుకాణం మంజూరు చేయలేదు. దీంతో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతకుంటకు విధిలేక సరుకుల కోసం వెళ్లక తప్పడం లేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 500 రేషన్ కార్డులు ఉంటేనే రేషన్ దుకాణం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందనే నిబంధనలు ఆ పల్లెవాసులకు గుదిబండగా మారిందనే ఆవేదన వెలిబుచ్చుతున్నారు.



ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదు

గ్రామపంచాయతీ ఏర్పడ్డ నాటి నుంచి రేషన్ దుకాణం మంజూరు చేయాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. గిరిజనులు సరుకుల కోసం పడుతున్న అవస్థలను వివరించి చెప్పినా వినిపించుకోలేదు. మారుమూల అటవీ ప్రాంతాల ప్రజల ఇబ్బందులను పట్టించుకోకపోవడం దారుణం.

- లావుడ్యా రవీందర్, రాజారాం తండా

దుకాణాలు ఏర్పాటు చేయాలి

ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని దుకాణాలు ఏర్పాటు చేయాలి. మండల పరిషత్ సమావేశాల్లో పలు మార్లు ఈ సమస్యను ప్రస్తావించి అధికారుల దృష్టికి తెచ్చిన సందర్భాలున్నాయి. జనాభా, కార్డులతో సంబంధం లేకుండా గ్రామపంచాయతీకి రేషన్ దుకాణం విధిగా మంజూరు చేస్తూ కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.



- కోలకాని శేఖర్, మాజీ సర్పంచ్ తుర్తి

అటవీ భూముల ఆక్రమణ .. ఒకరిపై కేసు నమోదు



అటవీ ప్రాంతంలో నరికిన చెట్లు

కోనరావుపేట, జూన్ 7: అటవీ భూములను ఆక్రమించేందుకు టేకు చెట్లతో సహా అన్నిటినీ నరికి వేస్తున్నారు. రెండు రోజుల క్రితం అధికారులు ఒకరిపై కేసు నమోదు చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో అక్రమార్కులు అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. కోనరావుపేట అటవీ ప్రాంతంలోని ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ టెంపుల్ ఆవరణలోని అటవీ ప్రాంతంలో ఏకంగా మిషన్ల ద్వారా చెట్లను నరికి వేస్తున్నారు. అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారం రోజులుగా మిషన్‌లతో చెట్లను నరికి వేస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. చక్రాల వేణు అనే వ్యక్తిపై ఇప్పటికే అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. అయినప్పటికీ చెట్లను నరికి వేస్తూ అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. చెట్లను నరికి వేస్తూ అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోనరావుపేట మండల వాసులు కోరుతున్నారు. అటవీ భూముల ఆక్రమణపై ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్‌ను వివరణ కోరగా చెట్లను నరికి వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే చక్రాల వేణుపై కేసు నమోదు చేశామన్నారు. మిషన్‌లతో చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెండు గ్రామాల మత్స్యకారుల మధ్య చేపల చెరువు వివాదం

చందుర్తి, జూన్ 7 : చేపల కోసం రెండు గ్రామాల మధ్య పంచాయతీ ఏర్పడింది. చందుర్తి మండలంలోని కట్టలింగంపేట, లింగంపేట గ్రామాల శివారులో గురునాథం చెరువు ఉంది. గతంలో కట్టలింగంపేటకు చెందిన గంగపుత్ర సంఘం మత్స్యకార్మికులు సొసైటీ ఏర్పాటు చేసుకొని మత్స్యకారులు కలిసి చేపలు పట్టుకునే వారు. వాటా(పాలు) పంచుకునేవారు. శుక్రవారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో కట్టలింగంపేటకు చెందిన మత్స్యకారులు గురునాథం చెరువులో చేపలు పట్టుకొని వచ్చారు. లింగంపేటకు చెందిన మత్స్యకారులు వెళ్లడంతో విషయం తెలుసుకున్న కట్టలింగంపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువు వద్దకు వెళ్లి తమ చెరువులో చేపలు పట్టవద్దంటూ అడ్డుకున్నారు. దీంతో రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారులు చెరువు మాదంటే, మాదే అనడంతో వివాదం తలెత్తింది. ఏడాది క్రితం కూడా వివాదం తలెత్తింది. గతంలో చెరువు సొసైటీ ఏర్పాటు చేసుకొని ఎవరైతే పట్టుకున్నారో వారే పట్టుకోవడానికి హక్కులు ఉంటాయని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. లింగంపేటకు చెందిన మత్స్యకారులు చెరువులో తమ పట్టా భూములు ఉన్నాయని చెప్పడంతో, సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇస్రో ఆన్‌లైన్ శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక


షరీఫ్ అహ్మద్

చిగురుమామిడి, జూన్ 7: మండలంలోని రామంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ శిక్షణకు ఎంపికయ్యా రని ప్రధానోపాధ్యా యుడు ఎస్ దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో నిర్వ హించే శిక్షణ కార్యక్రమానికి షరీఫ్ అహ్మద్ ఎంపిక కావడం సంతోకరమని పేర్కొన్నారు. దీని ద్వారా జాతీయ స్థాయిలో పాఠశాలకు గుర్తింపు రావడం సంతోషకరమని తెలిపారు.

గత ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యంతోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీ నష్టం

- ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకే మూడు బ్యారేజ్‌ల మరమ్మతులు
- పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి
- బ్యారేజీల నష్టంపై జ్యుడీషియల్ కమిటీ విచారణ
- తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని తప్పకుండా నిర్మిస్తాం
- రాష్ట్ర నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంథని/మంథనిరూరల్, జూన్ 7: గత ప్రభుత్వంలో పెద్దల నిర్లక్ష్యంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు భారీ నష్టం జరిగిందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంథని మండలంలోని సుందిళ్ల బ్యారేజీలో కొనసాగుతున్న మరమ్మతు పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలను ఏజెన్సీల ద్వారా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన బ్యారేజీల్లో కొనసాగుతున్న రిపేర్ పనుల్లో ప్రతి పనికి నిర్దిష్ట సమయం నిర్దేశించుకుని వేగవంతంగా పూర్తి చేయాలి అధికారులకు సూచించారు. సుందిళ్ళ బ్యారేజీ వల్ల స్థానికంగా వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మతు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తికావాలన్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి పనికి సమయాన్ని నిర్దేశించుకొని దానిలోపు ఆ పని పూర్తిచేసే విధంగా ఏజెన్సీలు పనిచేయాలని, ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తూ ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 3 బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, దేశంలోనే పార్లమెంట్ ద్వారా ఏర్పాటు చేసిన అత్యున్నత సంస్థ అయిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీలకు బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించేందుకు తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ జడ్జీ చంద్ర ఘోష్ ఆధ్వర్యంలో వేసిన జ్యుడీషియల్ కమిషన్ సైతం ప్రాజెక్టును సందర్శిస్తుం దన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని తప్పనిసరిగా నిర్మిస్తామన్నారు. ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సుందిళ్ల(పార్వతి) బ్యారేజ్ వద్ద కొట్టుకుపోయిన ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం జియో ఫిజికల్, జియో టెక్నికల్ జనరల్ పరీక్షలు నిర్వహించి కొట్టుకుపోయిన ఇసుకను అంచనా వేసి వాటిని పునరుద్ధరించి బ్యారేజీ సంరక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసి రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ, ఎస్ఈఎం. కరుణాకర్, ఈఈ సర్దార్ ఓంకార్ సింగ్, ఇతర నీటి పారుదల అధికారులు, మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, శశిభూషణ్‌కాచే, పీఏసీఎస్ ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చంద్రఘోష్‌ను కలిసిన అదనపు కలెక్టర్

జ్యోతినగర్, జూన్ 7: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విచారణ కమిషన్ ఛైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పి చంద్రఘోష్‌ను శుక్రవారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని వీజీపీ గెస్ట్‌హౌస్(జ్యోతిభవన్)లో అ దనపు కలెక్టర్ జె అరుణశ్రీ కలిశారు. విచారణలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించిన తరువాత ఎన్టీపీసీకి వచ్చిన కమిషన్ ఛైర్మన్‌కు అదనపు కలెక్టర్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.


చంద్రఘోష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్

హత్యా.. ఆత్మహత్యా?

- అనుమానాస్పదంగా మృతి చెందిన జూనియర్ అసిస్టెంట్ - శరీరంపై గాయాలు
- సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు - జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో విషాదం


రమేశ్(ఫైల్)


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 7: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. కాలనీలో నివాసముంటూ జూనియర్ అసిస్టెంట్‌గా విధలు నిర్వర్తిస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుళ్లకోట గ్రామానికి చెందిన పంగ రమేశ్(50) అనే వ్యక్తి పట్టణంలోని రాంనగర్‌కాలనీ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. గతంలో వీఆర్ఏ, వీఆర్‌వోగా పనిచేసిన ఆయన వీఆర్‌వో వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రస్తుతం భూపాలపల్లి మునిసిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య రేణుక పిల్లలను తీసుకొని రెండు రోజుల కిందటే కరీంనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లగా రమేశ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తీసి ఉండటం, కోతులు ఇంట్లోకి చొరబడి చిందరవందర చేశాయి. దీంతో గమనించిన ఇంటి పక్కనున్న వారు కోతులను కొట్టేందుకు ఇంట్లో వెళ్లి చూడగా రమేశ్ విగత జీవిగా బాత్ రూమ్‌లో పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి ఇన్‌చార్జ్ సీఐగా ఉన్న చిట్యాల సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై ప్రసాద్ లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారి ని ఆరా తీశారు. కాగా, మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయి.

● అదుపులో ఇద్దరు వ్యక్తులు..?

ఈ ఘటన వివరాలు తెలియగానే సకాలంలో చేరుకున్న పోలీసులు రమేష్ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. విచారణను వేగవంతం చేసి మృతుడి ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి అందులోని హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యుల్లోని ఓ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. కుటుంబ అవసరాలకు పంగ రమేశ్ వారి బంధువుల వద్ద తీసుకున్న డబ్బుల విషయంలోనే గొడవలు జరిగి ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే చర్చ జరుగుతోంది. కాగా, పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తుండటం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

విచారణ తదుపరి వివరాలు వెల్లడిస్తాం..

- మల్లేష్‌యాదవ్, భూపాలపల్లి ఇన్‌చార్జి సీఐ

భూపాలపల్లి రాంనగర్‌లో జరిగిన ఘటనపై మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో విచారణ చేసిన పిదప వివరాలు వెల్లడిస్తాం. శరీరంపై గాయాలు ఉండటం మూలంగా హత్య చేసినట్లుగానే అనుమానిస్తున్నాం. త్వరలోనే నిజాలు తేల్చి హత్యా.. ఆత్మహత్యా.. సాధారణ మరణమనేది చెబుతాం.

అగ్ని పర్వతంపై కరీంనగర్ మహిళ

కరీంనగర్ అర్బన్, జూన్ 7: అగ్ని పర్వతంపై మొదటిసారిగా భారతదేశానికి చెందిన ఇద్దరు మహిళలు అడుగుపెట్టి చరిత్ర సృష్టించారు. ఆ ఇద్దరిలో ఒకరు మహమ్మద్ పర్వీన్ సుల్తానా కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందినవారు. ఆసియా ఖండంలో ఏకైక అగ్ని పర్వతం అండమాన్ నికోబార్ దీవులలో బెరన్ ఐలాండ్‌లో ఉంది. ఆ అగ్ని పర్వతంపై మొదటిసారిగా ఇద్దరు మహిళలు అడుగుపెట్టారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సెస్, డెహ్రాడూన్, ఇస్రో వారి ప్రత్యేక పరిశోధన ప్రాజెక్టులో భాగంగా డాక్టర్ మమతా చౌహాన్ సారథ్యంలో పరిశోధకుల బృందం అగ్ని పర్వతవం వద్దకు వెళ్లారు. ఆ బృందంలో ఒక రు రీంనగర్ కోతిరాం పూర్‌కు చెందిన మహమ్మద్ పర్వీన్ సుల్తానా. మే 29న బెరెన్ ఐలాండ్‌లోని అగ్ని పర్వతంపై ఆమె అడుగు పెట్టారు. ఈ పరిశోధనలో భాగంగా అగ్ని పర్వతం భౌగోళిక పరిణామాలు, శాస్త్రీయ విశ్లేషణ, అగ్ని పర్వత పనితీరు, ప్రకృతి విపత్కర పరిస్థితులపై అంచనా కోసం అక్కడ నుంచి వివిధ రకాల నమూనాలను సేకరించారు. అండమాన్ ఐలాండ్‌లోని డిగ్లీపూర్ నుంచి రంగౌత్ వరకు సుమారు వంద కిలోమీటర్లకు పైగా వివిధ ప్రాంతాలలో నమూనాలను సేకరించారు.


పర్వీన్ సుల్తానా

వివాహిత ఆత్మహత్యాయత్నం

మల్యాల, జూన్ 7: జగిత్యాలకు చెందిన ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్య యత్నం చేసుకుంది. రజిత అనే ఆశవర్కర్ శుక్రవారం ఉదయం మల్యాల మండలం నూకపల్లి శివారులో గల బావిలో దూకగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది సంపత్ తదితరులు అక్కడకు చేరుకొని స్థానికులతో కలసి ఆమెను బావిలో నుంచి తీశారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు రజితను ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రమాదం ఏమీ లేదని తెలిసింది. ఆత్మహత్యయత్నంకు కారణాలు తెలియలేదు. ఫిర్యాదు రాలేవదని ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

రైతుకు తీవ్ర గాయాలు

సైదాపూర్, జూన్ 7: సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన దాసరి గోపాల్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో టాక్టర్ రోడ్డువేటర్‌తో భూమి చదును చేయిస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు వేటర్ మధ్య కాలు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తన వ్యవసాయ భూమిలో రోడ్డు వేటర్‌తో భూమి దున్నుతుంటే గోపాల్ వెనుక నుంచి ట్రాక్టర్ ఎక్కబోయి ప్రమాదవశాత్తు జారాడు. కాలు రోడ్డు వేటర్లో పడడంతో తెగిపోయింది. గోపాల్‌ను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి, జూన్ 7 : చందుర్తి మండలం లింగంపేటలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. లింగంపేట గ్రామంలో బోజ సుభాష్ అక్రమంగా రేషన్ బియ్యం ఓ ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఇంట్లోని ఓ గదిలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేసి ఉండగా సీజ్ చేశారు. ఈ ఘటనలో సుభాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలించడం నేరమని తెలిపారు.

డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, జూన్ 7: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటు కళాశా లల్లో రెండు సంవత్సరాల కోర్సులైనా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) మొదటి సంవత్సరము 2004-25లో చేరేందుకు నిర్వహించే డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైందని ఎల్ఎండీ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. షెడ్యూల్ తెగల, షెడ్యూల్ కులాలు, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు 1,2024 నాటికి 17 సంవత్సరాల వయస్సు ఉండాలని గరిష్ట వయో పరిమితి లేదని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జూలై 10వ తేదీన ఉంటుందని తెలిపారు. డీఈఎల్ ఈడీ కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుందని పేర్కొన్నారు. డీపీఎస్ఈ మాత్రము కేవలం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని తెలిపారు. వివరాలకు డీఈఈసెట్-2024 వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు.

ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

మానకొండూర్, జూన్ 7: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన రౌడీ షీటర్ గోపు ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పచ్చునూర్‌లో భూ వివాదంలో రమేశ్, ప్రశాంత్‌రెడ్డి ఇద్దరు రౌడీషీటర్ల మధ్య గొడవలు ముదిరి మే 28న హత్యకు తీశాయని తెలిపారు. హత్య జరిగిన అనంతరం 11 మంది పరారు కాగా ఇందులో ప్రధాన నిందితుడితో పాటు మరో 8మందిని ఈ నెల 4న పోలీసులు అరెస్టు చేశారు. కాగా. మరో ఇద్దరు గాజు శంకర్, మద్దెల వెంకటేశ్‌లు తప్పించుకోగా శుక్రవారం మండల కేంద్రంలో వారిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రూ. 1.40 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సైదాపూర్, జూన్ 7: సైదాపూర్ పోలీస్‌స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న చట్ల ఆంజనేయులు అనే కానిస్టేబుల్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కాడు. తన ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు డ్రా చేసుకున్నారని బాధితుడు ఆంజనేయులు గురువారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. సైబర్ నేరగాళ్లు గత నెల 30న ఆంజనేయులు సెల్‌కు కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్ట చేసినంతలో ఆంజనేయులు సెల్‌కు ఓటీపీ వచ్చింది. కొంత సేపటికి ఆంజనేయులు సెల్ బ్లాక్ అయింది. కొత్త సిమ్ తీసుకునేంతలోపు ఆంజనేయులు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు డ్రా చేసుకున్నారు. తన సిమ్ ఆక్టివేట్ అవగానే ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు ఆంజనేయులుకు మెసేజ్‌లు వచ్చాయి. ఖాతాలో ఉన్న రూ.1.93లక్షల నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 1.40లక్షలుడ్రా చేశారని గుర్తించాడు. దీంతో కానిస్టేబుల్ తన ఖాతాను బ్లాక్ చేపించాడు. గురువారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జూన్7: కుటుంబ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని ఏడు సంవత్సరాల బాలికపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టిన నేరంలో నిందితుడు కారుపాక రాజ్‌కుమార్(20)కు 20 ఏళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకటేష్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన వివాహితకు భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బతుకుదెరువు కోసం భర్త పిల్లలతో కలిసి వచ్చి హుజూరాబాద్‌లోని గ్యాస్ గోదాం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కొన్నాళ్లకు భర్త అనారోగ్యంతో చనిపోగా ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నది. వీణవంక మండలం పోతిరెడ్డి పేటకు చెందిన కారుపాక రాజ్‌కుమార్ తల్లితో కలిసి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. వివాహిత కుటుంబంతో రాజ్‌కుమార్‌కు పరిచయం ఉన్నది. దీన్ని ఆసరా చేసుకున్న రాజ్‌కుమార్ ఆమె పెద్దమ్మాయికి మాయమాటలు చెప్పి 2020 ఆగస్టు 8న మధ్యాహ్నం తన ఇంటికి తీసుకువెళ్ళి ఆమెపై అత్యాచారం చేశాడు. మరుసటి రెండు రోజులు కూడా అత్యాచారం చేసి ఎవరికీ చెప్పొద్దని బెదించాడు. రెండు రోజుల తరువాత బాలికకు తల్లి స్నానం చేయిస్తుండగా అమ్మాయి పరిస్థితి చూసి ఏమి జరిగిందని ఆరా తీయగా విషయం మొత్తం తల్లికి వివరించింది. బాలిక తల్లి హుజూరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటికి సీఐ మాధవి రాజ్‌కుమార్ పై కేసు నమోదు చేశారు. మరో సీఐ ఎస్ శ్రీనివాస్‌రావు ఈ కేసు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాజిక్యూటర్ జూలూరి రాములు విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి నిందితుడు రాజ్‌కుమార్‌కు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అంజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.1.09 కోట్లు


హుండీ సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, జూన్ 7: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.1,09,62,169 నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. 34 రోజులకు ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 44గ్రాముల మిశ్రమ బంగారం, 3.800కిలోల మిశ్రమ వెండి, 41విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో వరంగల్ డీసీ సంజీవరెడ్డి, ఏఈవో వై. అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీ లలిత సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, జూన్ 7: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన చిర్ర అనిల్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లిఖార్జున్‌రెడ్డి, నాయకులు ముత్యం శంకర్, శంకర్‌గౌడ్, సతీష్. అజయ్‌గౌడ్, శోభన్, అజయ్‌రెడ్డి, విక్రం, నవీన్, భరత్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల మండల కమిటీ ఏర్పాటు



ధర్మపురి మండల ప్రైవేట్ పాఠశాలల నూతన కమిటీ

ధర్మపురి, జూన్ 7: ధర్మపురి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ట్రస్మా జగిత్యాల జిల్లా శాఖ ముఖ్య సలహాదారు సంగనభట్ల దినేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గట్ల శ్రీనివాస్, చిలువేరి శ్యాంసుందర్, అధ్యక్షులుగా జాజాల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అరికెల సతీష్, కోశాధికారిగా చల్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ఇన్నారపు మహేష్, మోటూరి నరేష్‌లను ఎన్నుకున్నారు. వారందరినీ పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

జువ్వాడి నర్సింగరావు వివాహ దినోత్సవం



మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి, జూన్, 7 : కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, రజని దంపతుల పెళ్లి రోజు వేడుకలను పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్‌ను స్థానిక నాయకులతో కలిసి కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు జువ్వాడి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు లింగారెడ్డి, సహదేవ్, గంగాధర్, మధవరెడ్డి, రాజేష్, రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, జాకీర్, ప్రదీప్, భరత్, రాజారెడ్డి, ముఖీమ్, షకీల్, రమేష్, చరణ్‌సింగ్, మహేందర్ ఉన్నారు.

పెద్దలకు బీసీజీ టీకాతో క్షయ నివారణ

● డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మల్యాల, జూన్ 7: పెద్దలకు బీసీజీ టీకాతో క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చునని గ్రామాల్లో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరికీ బీసీజీ టీకా వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్. శ్రీనివాస్ సూచించారు. మల్యాలలో శుక్రవారం అంగన్‌వాడీలు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిర్వహించాలని బీసీజీ టీకా వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో వైద్యురాలు మౌనిక, రాధ ఏఎన్ఎం, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు

సారంగాపూర్: పెద్దల బీసీజీ టీకాతో టీబీ వ్యాధి పూర్తిగా నిర్మూలన సాధ్యమవుతుందని సారంగాపూర్ మండల వైద్యాధికారి శివకుమారి అన్నారు. సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలకు, అంగన్‌వాడీకార్యకర్తలకు బీసీజీ టీకాపై శిక్షణ నిర్వమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి సర్వే నిర్వహించి బీసీజీ టీకా లబ్ధిదారులను గుర్తిస్తామన్నారు. బీసీజీ టీకా ఉపయోగాలను ప్రజలకు వివరించాలని అన్నారు.

జడ్పీటీసీ జన్మదిన వేడుకలు



కథలాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కథలాపూర్, జూన్ 7: మండల కేంద్రంలో శుక్రవారం జడ్పీటీసీ నాగం భూమయ్య జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్‌లో కేక్ కట్ చేసి పలువురికి తినిపించారు. ప్రజాసేవలో భూమయ్య చూపుతున్న చిత్తశుద్ధి పట్ల పలువురు ప్రశంసించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేయగా వైద్యాధికారిణి జడ్పీటీసీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు వర్ధినేని నాగేశ్వర్‌రావు, గుండారపు సౌజన్యగంగాధర్, మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి, వైస్ ఎంపీపీ గంద్ర కిరణ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు రఫీ, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు ఉన్నారు.

ఆయిల్ ఫాం తోటల పరిశీలన

కొడిమ్యాల, జూన్ 7 : మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన రైతు పడాల దేవేందర్ ఆయిల్ ఫాం తోటను శుక్రవారం మండలంలోని తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్ పరిశీలించారు. ఆయిల్ ఫాం మొక్కల ఎదుగుదలకు తీసుకున్న చర్యలను వాడిన ఎరువులను గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. కోతులు, పందుల బాధకు ఆయిల్‌ఫాం తోటను ఎంచుకున్నట్లు రైతు తెలిపాడు. మూడు సంవత్సరాల తర్వాత పంట చేతికి వస్తుందన్నారు. చైర్మన్ వెంట డైరెక్టర్ వేణుగోపాల్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి



బుగ్గారం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజమణి

బుగ్గారం జూన్6: మండల ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సేవలు అందించాలని బుగ్గారం ఎంపీపీ బాదినేని రాజమణి అన్నారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బదినేని రాజమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో అధికారులు,ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై వివరించారు. ఎంపీవో అఫ్జల్ మియా మాట్లడుతూ రోడ్డు ఇరువైపులా విద్యుత్ వైర్ల కింద చెట్లను పూర్తిగా నరికి వేస్తున్నారని, కేవలం కొమ్మలను తొలగించాలని విద్యుత్ అధికారులను కోరారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ సేవ కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉండటం లేదని మద్దునూర్ ఎంపీటీసీ గాలిపెల్లి మహేష్ వ్యవసాయ అధికారులను కోరారు. సిరికొండ గ్రామంలో ప్రతి సంవత్సరం విద్యుత్ షాక్‌తో గెదేలు చనిపోతున్నాయని , విద్యుత్ అధికారులు లూజ్ పోల్స్‌లను సరిచేసి, మిడిల్ పోల్స్‌ను ఏర్పాటు చేసి రైతుల పశువులను కాపాడాలని జడ్పీటీసీ బాదినేని రాజేందర్ అధికారులకు ఆదేశించారు. అదే విధంగా ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు ఎన్ని ఇచ్చారో వాటి రికార్డులు ఉన్నాయా అని ఎంపీవోని ప్రశ్నించారు. ప్రతి సర్వసభ్య సమావేశానికి పశువైద్యాధికారి హాజరు కావడం లేదని ఎంపీపీ అన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ పదవీ కాలం పూర్తి అవుతుందని, అభివృద్ధికి సహకరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంపీడీవో శ్రీనివాస్,మండల కో అప్షన్ సభ్యులు అబ్దుల్ రహమన్,ఎంపీటీసీ గాలిపెల్లి మహేష్ పాల్గొన్నారు.



కోరుట్లలో మాట్లాడుతున్న ఎంపీపీ తోట నారాయణ

సభ్యుల సహకారంతో మండల అభివృద్ధి

- కోరుట్ల ఎంపీపీ తోట నారాయణ

కోరుట్ల రూరల్, జూన్ 7: గడిచిన ఐదు సంవత్సరాలలో సభ్యుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేసినట్లు ఎంపీపీ తోట నారాయణ అన్నారు. మండల సర్వసభ్య చివరి సమావేశం ఎంపీపీ తోట నారాయణ అధ్యక్షతన జరుగగా వివిధ శాఖల మండల అధికారులు ఎజెండా అంశాలను సభ్యుల ముందు ఉంచారు. వివిధ సమస్యలపై సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని సంగెం నాగులపేట గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్ణంగా ఉన్నాయని నిర్మాణం పూర్తి చేసి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఇరు గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఎఖీన్‌పూర్ సింగిల్ విండో చైర్మెన్ నర్సరెడ్డి సభా దృష్టికి తీసుకెళ్లారు. అధికారులకు నివేదించి పనులను పూర్తి చేయాలని ఎంపీపీ తోట నారాయణ, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. పలు గ్రామాలలో రహదారుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సభ్యులు సభ దృష్టికి తీసుకవచ్చారు. చివరి సమావేశం కావడంతో వివిధ గ్రామాల ఎంపీ టీసీ సభ్యులు, ఎంపీపీ తోట నారాయణ, వైస్ ఎంపీపీ చీటి స్వరూప, జడ్పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య - రాజేష్‌లను మండల ప్రజపరిషత్ అధికారులు, గ్రామస్థాయి అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ నీరజ, సూపరిడెంట్ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మెన్ నర్సరెడ్డి, బండి భూమయ్య, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎంపిక

కోరుట్ల రూరల్, జూన్ 7: మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఎకగ్రీవంగా ఎంపికయినట్లు గ్రామ ఐక్య వేదిక సభ్యులు శుక్రవారం తెలిపారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడుగా ఎండి ఆశీం, ఉపాధ్యక్షలుగా గోల్లపలి శ్రీనివాస్ గౌడ్, మారు శేఖర్ రెడ్డి, ప్రదాన కార్యధరి తోగిటి లక్ష్మణ్, కార్యధర్శి లక్కం వేంకటేష్, కోశాధికారిగా వెలుమల ఏకాంబర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు కుందారపు సురేష్, సలహాదారులుగా చేతి సాయికృష్ణ, కార్యవర్గ సభ్యులుగా పంది రాజేందర్, ఓరుగంటి రాజగంగారాజం, దుంపెట స్వామి, బోల్లె రాజయ్య, కల్లెం వెంకటి, దేశవేణి ముత్యయ్య, కుంచు మహిపాల్, లింగపల్లి తిరుపతి, అరకంటి మల్లేశంను ఎకగ్రీవంగా ఎనుకున్నట్లు తెలిపారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల రూరల్, జూన్ 7: మండలంలోని అయలాపూర్ గ్రామంలోని ముదిరాజ్ సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు శుక్రవారం తెలిపారు. సంఘ అధ్యక్షుడుగా రాణివేని సురేష్, ఉపాధ్యక్షుడిగా పులవేణి రాజేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

నియామకం

మెట్‌పల్లి, జూన్, 7: పట్టణంలోని పోచమ్మవాడ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా నేమూరి బాలకృష్ణను ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సంఘంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా నేమూరి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆడెపు చిన్నగంగారాం, పెద్దమ్మ ఆలయం అభివృద్ధి కమిటీ సభ్యులుగా తోకల సత్యనారాయణ, తోకల చిన్నోల్ల పెద్దవెంకటి, నేమూరి నడిపి నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడు మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభివృద్ధికి సంఘ సభ్యుల సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలకు ప్రశాంత వాతావరణం కల్పించాలి



జ్ఞాపిక అందిస్తున్న బ్రహ్మకుమారీలు

కోరుట్ల రూరల్, జూన్ 7: చిన్నపిల్లలకు తల్లిదండ్రులు ప్రశాంత వాతవరణం కల్పించాలని వ్యక్తిగత వికాసం అవగాహన సభ్యురాలు సుమలత, పిల్ల వైద్య నిపుణుడు దిలీప్‌రావులు అన్నారు. మండలంలోని కల్లూర్ గ్రామంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో శివసాయి ప్రెస్టీజ్ పార్క్‌లో చిన్నారుల వ్యక్తిగత వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వనపర్తి చంద్రమోహన్, కొత్త సునిల్, శ్రీనివాస్‌రావు, బ్రహ్మకుమారీలు బీకే రాజేశ్వరిలతోపాటు ఈశ్వరీయ పరిహారం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



దొనూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట



పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

ధర్మపురి, జూన్ 7: ధర్మపురి మండలంలోని దొనూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కాశెట్టి రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మారాజు రాజేశ్వరి మాట్లాడుతూ గత సంవత్సరం పాఠశాలలో చేపట్టిన విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యాసన అంశాలకు సంబంధించిన ఒక కరపత్రాన్ని తయారు చేసినట్లు తెలిపారు. ఈ కరపత్రాలను గ్రామంలో వాడవాడల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు, యువతకు, గ్రామ పెద్దలకు పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ఒత్తిడి లేని విద్య, ఎలాంటి ఫీజులు లేకుండా గుణాత్మకమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో పిల్లలను చేర్పించి పాఠశాల అభివృద్ధి కోసం సహకారం అందించాలని కోరారు. ఉపాధ్యాయులు బడి బాట ప్రతిజ్ఞ చేసి, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

● కొడిమ్యాల : మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి తిరుగుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భూపతిపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



పెగడపల్లి మండలం అయిత్‌పల్లిలో పూర్వ విద్యార్థులు

రాయికల్, జూన్ 7: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి పాఠశాల గుర్తులను జ్ఞాపకం చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీపతి రాఘవులు, డిగ్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పడాల తిరుపతి, ఉపాధ్యాయులు భూపతి రావు, రాజేందర్, రమేష్, కోటేశ్వర్ రావు, చిన్నయ్య, శేఖర్, శ్రీను, రాజేంద్రప్రసాద్, జగన్ పాల్గొన్నారు.

పెగడపల్లి : పెగడపల్లి మండలంలోని అయిత్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. 2006-07 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంతా పాఠశాలలో సమావేశమై తమ గురువులను సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు తాము ఏఏ రంగాలలో స్థిరపడ్డది తెలుపుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, జూన్ 7: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస సబ్‌స్టేషన్, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, పొలాస గుల్లపేట, అనంతారం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొడిమ్యాల సబ్‌స్టేషన్ పరిధిలో..

కొడిమ్యాల, జూన్ 7: కొడిమ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మధాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రఘునాథ్ తెలిపారు. కొడిమ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలోని రామకిష్టాపూర్, కొండాపూర్, చింతల్లపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్యాల మండలంలో..

మల్యాల, జూన్ 7: మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి, మద్దుట్ల సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో ఆయా సబ్‌స్టేసన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈఈలు తెలిపారు. దీంతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల, మద్దుట్ల, గొర్రెగుండం, గొల్లపల్లి, రామన్నపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోరుట్ల పట్టణంలో..

కోరుట్ల, జూన్ 7: కోరుట్ల పట్టణంలోని వివిధ ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టాన్స్‌కో టౌన్ ఏఈ 2 సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ బిలాల్‌పుర, ఆదర్శనగర్, వేములవాడ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగ దారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎమ్మార్సీకి చేరుకున్న స్కూల్ యూనిఫాంలు



యూనిఫాంలు ఎమ్మార్సీలో అందజేస్తున్న ఏపీఎం చంద్రకళ

వెల్గటూర్, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సంబంధించిన స్కూల్ యూనిఫాంలు స్వశక్తి మహిళల ఆధ్వర్యంలో కుట్టించారు. ఈ యూనిఫాంలు శుక్రవారం ఎమ్మార్సీలో అందజేసినట్లు ఏపీఎం చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 686 బాలికలకు సంబంధించిన యూనిఫాంలు వచ్చినట్లు తెలిపారు. గతంలో ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టు ఇచ్చే వారని ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వం మహిళా సంఘ సభ్యులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. ఒక్కో యూనిఫాంకు గతంలో రూ.50 చెల్లించే వారని ప్రస్తుతం రూ.75 చెల్లించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందుగా యూనిఫాంలు అందించాలని కలెక్టర్ ఆదేశించారని, అందుకు అనుగునంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంధర్‌రెడ్డి, మండల సమాఖ్య కార్యదర్శి సుమలత, కోశాధికారి సత్యవతి, కవిత పాల్గొన్నారు.



నాయకులను సన్మానిస్తున్న టేకేదారులు

బీడీ టేకేదారు సంఘ నాయకులకు సన్మానం

మల్యాల, జూన్ 7: బీడీ టేకేదార్ల కమీషన్ పెంపునకు కృషి చేసిన రాష్ట్ర బీడీ టేకేదార్ల సంక్షేమ సంఘం ధ్రాన కార్యదర్శి తీగల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు క్యాస మల్లారెడ్డిని మల్యాలలో శుక్రవారం సత్కరించారు. వెయ్యి బీడీలకు ప్రస్తుతం టేకేదార్లకు చెల్లిస్తున్న కమీషన్‌పై రూ4.50 పెంచడం అభినంధనీయమని ఈ సందర్భంగా అన్నారు. బీడీ టేకేదార్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కమీషన్ పంపునకు కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో టెలిఫోన్ బీడీ టేకేదార్లు బొమ్మకంటి గంగాధర్, ముల్క మల్లయ్య, మిట్టపల్లి వెంకన్న, ఊరెడి సత్తయ్య, మామిడాల గంగారాం, వేముల అశోక్, పొలాస మల్లేశం, రాజేందర్, ప్రసాద్, గాజుల అనిల్, చంద్రం, మ్యాన రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వంతెన నిర్మాణం

● సంవత్సరం దాటినా పూర్తి కాని పరిస్థితి ● ప్రయాణికులకు తప్పని తిప్పలు



నిలిచిపోయిన వంతెన నిర్మాణం

ఎండపల్లి, జూన్ 7: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలోని వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. సంవత్సరం దాటినా వంతెన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. గత సంవత్సరం జనవరిలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ. 3 కోట్ల 50 లక్షల వ్యయంతో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు కూడా నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ఈ రహదారి గుండా నిత్యం వందల వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి గుంతల మయంగా మారింది. గత సంవత్సరం కురిసిన వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు వరద తాకిడికి కొట్టుకు పోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చుట్టు పక్క గ్రామాల ప్రజలు ప్రతి అవసరానికి రాజారాంపల్లికి వస్తుంటారు. ఈ దారి వర్షానికి తెగడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదనంగా 10 కిలోమీటర్లు తిరిగి ప్రయాణించాల్సి వచ్చింది. గత సంవత్సరమే ప్రజలు ఇబ్బందులు పడ్డారని మళ్లీ ఈ సంవంత్సరం వర్షాకాలం ప్రారంభం అవుతున్నా నిర్మాణం పూర్తి కాలేదని ప్రజలు పేర్కొంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడడం లేదు. బ్రిడ్జి నిర్మాణం ఎప్పటి వరకు పూర్తవుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. తాత్కాలిక రోడ్డు గుంతల మయంగా, రాళ్లతో ఉంది. ఆ రహదారి గుండా వెళ్లాలంటే ప్రజలు నరక యాతన పడుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.